sahanamvande.com

epaper.sahanamvande.com

# సహనం వందే

హైదరాబాద్ | 08-09-2026 మంగళవారం | సంపుటి-02 సంచిక : 149 EDITOR: ROHINI





# బీసీ ఉప-వర్గీకరణం

## తెరపైకి సబ్-కేటగిరైజేషన్ డిమాండ్




**రిజర్వేషన్ల ఫలాలు నిజంగా అర్హులైన పేదలకు అందుతున్నాయా? లేక ఒకే కులంలో ఉన్న కొద్దిమంది బాగా స్థిరపడిన వాళ్లే రిజర్వేషన్లను కొల్లగొడుతున్నారా? ఇప్పుడు దేశవ్యాప్తంగా ఇదే హాట్ టాపిక్! ఓబీసీ రిజర్వేషన్లలో 'క్రీమీలేయర్' విధానాన్ని ఎత్తివేసి ఉప-వర్గీకరణ (సబ్-కేటగిరైజేషన్) తేవాలనే డిమాండ్ ఊపందుకుంటోంది. అసలు సుప్రీంకోర్టు తాజా తీర్పులు ఏంటి? ప్రభుత్వాలు ఎందుకు తికమక పడుతున్నాయి?**

**- సహనం వందే, హైదరాబాద్**

- మరో రిజర్వేషన్ కోసం ఓబీసీల పోరు
- క్రీమీలేయర్ తొలగించాలన్న డిమాండ్లు
- వెనుకబడిన వర్గాల్లో విభిన్న అభిప్రాయాలు
- ఎస్సీ రిజర్వేషన్లపై తీర్పుతో కొత్త చిచ్చు

ఓబీసీ వర్గాల్లో ఇప్పటికే ఆర్థికంగా, ఉద్యోగపరంగా స్థిరపడిన ఉన్నత వర్గాలను వేరు చేసేందుకు 'క్రీమీలేయర్' నిబంధనను తెరపైకి తెచ్చారు. కానీ ఈ నిబంధన అమలులో లెక్కలేనన్ని లొసుగులు ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా తల్లిదండ్రుల ఉద్యోగాలు, జీతాల లెక్కింపు విషయంలో స్పష్టమైన కొలమానం లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. దీనివల్ల కొందరు అర్హులు నష్టపోతుంటే, మరికొందరు నిబంధనల వెసులుబాటుతో ప్రయోజనం పొందుతున్నారనే వాదన బలపడింది.

### సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో రిజర్వేషన్లపై...

సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో ఓబీసీ అభ్యర్థుల ఎంపిక సమయంలో జీతాలను ఆదాయంతో కలిపి క్రీమీలేయర్ కింద లెక్కించకూడదని కోర్టు స్పష్టం చేసింది. ఈ నిబంధనల వల్ల అనేక మంది ప్రతిభావంతులైన అభ్యర్థులు సర్వీసులకు దూరమయ్యారు. అయితే కోర్టు తీర్పుల తర్వాత కూడా కేంద్ర ప్రభుత్వం, సంబంధిత శాఖల మధ్య సమన్వయం లేకపోవడం అభ్యర్థులను అయోమయంలో పడేసింది. ఒకవైపు కోర్టు తీర్పును అమలు చేస్తామని చెబుతూనే, మరోవైపు పునఃపరిశీలన కోరడం ఈ సమస్య ఎంతటి సంక్లిష్టంగా మారిందో తెలియజేస్తోంది.

### కొన్ని కులాలకే లబ్ధి జరుగుతుందా?

అందుకే ఇప్పుడు ఓబీసీ వర్గాలన్నింటినీ సమానంగా చూడలేమనే వాదన గట్టిగా వినిపిస్తోంది. ఓబీసీ జాబితాలో ఉన్న వందలాది కులాలలో కేవలం కొన్ని కులాలు లేదా కొన్ని కుటుంబాలు మాత్రమే రిజర్వేషన్ల ఫలాలను సింహభాగం తన్నుకుపోతున్నాయనేది ప్రధాన ఆరోపణ. మిగిలిన అత్యంత వెనుకబడిన కులాలు మాత్రం దశాబ్దాలు గడిచినా కనీసం రిజర్వేషన్ ఫలితాలను పొందలేకపోతున్నాయి. అందుకే, ఓబీసీ రిజర్వేషన్లలో ఉప-వర్గీకరణ చేపట్టాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది.

### ఉప-వర్గీకరణ అంటే ఏమిటి?

ఉప-వర్గీకరణ అంటే ఏమిటి? ఓబీసీ రిజర్వేషన్ కోటాను కూడా వివిధ వర్గాల వెనుకబాటుతనం ఆధారంగా ఉప-కోటాలుగా విభజించడం. దీనివల్ల ప్రతి కులానికి, ప్రతి ఉప-వర్గానికి జనాభా ప్రాతిపదికన లేదా వారి వెనుకబాటుతనాన్ని బట్టి రిజర్వేషన్ ఫలాలు అందుతాయని నిపుణులు వాదిస్తున్నారు. ఎస్సీ సబ్-కేటగిరీలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు ఈ చర్చకు మరింత బలాన్నిచ్చాయి. ఎందుకంటే పెద్ద కులాల గుప్పెట్లోకి అన్ని రిజర్వేషన్ ఫలాలు వెళ్లిపోతే, అట్టడుగున ఉన్న అణగారిన కులాలకు ఒరిగేదేమిటనే ప్రశ్న తలెత్తుతుంది.

### క్రీమీలేయర్ ఎత్తివేతకు డిమాండ్లు...

మరోవైపు, క్రీమీలేయర్ నిబంధనను పూర్తిగా ఎత్తివేయాలనే డిమాండ్లు కూడా కొన్ని వర్గాల నుంచి గట్టిగానే వస్తున్నాయి. ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లను రద్దు చేయడం సరైన పద్ధతి కాదని, ఆర్థికంగా బలపడినంత మాత్రాన సామాజిక వివక్ష అనేది పోదని వారు వాదిస్తున్నారు. ఒక వ్యక్తి ఎంత సంపాదించినా కుల వివక్ష పోదని, కాబట్టి ఆర్థిక గీతను అడ్డుపెట్టి రిజర్వేషన్లను దూరం చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని కొందరు అభిప్రాయపడుతున్నారు.

### అమలులో కఠినత్వం అవసరమా?

దీనికి విరుద్ధంగా ఆలోచించే మరో వర్గం వాదన మరోలా ఉంది. ఒకే కుటుంబంలో తండ్రి ఐఏఎస్ అధికారిగా లేదా కోట్లు సంపాదించే వ్యాపారవేత్తగా ఉండి, అదే కుటుంబానికి చెందిన పిల్లలు మళ్లీ రిజర్వేషన్ ఫలాలను అనుభవిస్తే అది నిజంగా అర్హులైన పేదలక తీవ్రమైన అన్యాయం చేయడం అవుతుందని వారు స్పష్టం చేస్తున్నారు. నిజమైన సామాజిక న్యాయం జరగాలంటే రిజర్వేషన్ ఫలాలు అట్టడుగున ఉన్న వారికి చేరాలని, అందుకే క్రీమీలేయర్ నిబంధన మరింత కఠినంగా ఉండాలని కోరుకుంటున్నారు.




### సమగ్రమైన కులగణనే పరిష్కారమా?

ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకాలంటే కేవలం తాత్కాలిక కోర్టు తీర్పులు సరిపోవు. సమగ్రమైన కులగణన చేపట్టి ఏ కుల జనాభా, ఏ వర్గం జనాభా ఎంత వెనుకబడి ఉందనే పక్కా డేటాను సేకరించాలి. ఆ తర్వాతే విధానాలను రూపొందించాలి. అప్పుడే క్రీమీలేయర్ ఎత్తివేత లేదా సబ్-కేటగిరైజేషన్ అనే చర్చలకు అర్థం ఉంటుంది. లేకపోతే ఇది కేవలం రాజకీయ లబ్దికోసం జరిగే చర్చగానే మిగిలిపోతుంది.

# మధుమెక్కిన కుల దురహంకారం

## తాతా మధు వ్యవహారం... కేసీఆర్ ఇరకాటం

**బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఆ పార్టీని పూర్తిగా ఆత్మరక్షణలో పడేశాయి. అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత భాష వాడటం ఎంతవరకు సమంజసం అని అధికార పార్టీ సభ్యులు సూటిగా నిలదీస్తున్నారు. సభ గౌరవాన్ని, మర్యాదను పూర్తిగా దెబ్బతీసేలా ఈ మాటలు ఉన్నాయని అధికార పక్షం మండిపడుతోంది. ప్రభుత్వంపై వ్యూహాత్మకంగా ఒత్తిడి తేవాలనుకున్న ప్రతిపక్షం, చివరికి తమ స్వంత నేతల మాటల వల్లే ఇరుకున పడాల్సి వచ్చింది.**

**- సహనం వందే, హైదరాబాద్**

- దళిత స్పీకర్ అంటే అగ్రవర్ణాలకు చులకనా?
- బీఆర్ఎస్ పార్టీకి దిక్కుతోచని దుస్థితి

గడ్డం ప్రసాద్ కుమార్ కేవలం అసెంబ్లీ స్పీకర్ మాత్రమే కాదు. ఆయన ఒక దళిత నాయకుడు,సమాజంలో ఎంతో కష్టపడి పైకి వచ్చి ఒక అత్యున్నత రాజ్యాంగ పదవిని అలంకరించిన వ్యక్తి. అలాంటి ఒక వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని ఆయన కన్నతల్లిని వివాదంలోకి లాగడం ఏ రాజకీయ సంస్కృతికి నిదర్శనం? ఈ తరహా వ్యాఖ్యలు చివరికి బీఆర్ఎస్ పార్టీకి రాజకీయంగా ఎసరు పెట్టేలా మారాయి.

### "మీ తల్లిని కాదు కదా"

అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆవేదన ఎవరినైనా కదిలిస్తుంది. "మీ తల్లిని కాదు కదా... నా తల్లిని అన్నప్పుడు నాకు ఎంత బాధ అనిపించిందో తెలుసా" అని బీఆర్ఎస్ సభ్యులను ఉద్దేశించి ఆయన కంటతడి పెట్టుకున్న క్షణం తీవ్ర భావోద్వేగానికి గురిచేసింది. గౌరవం కోసం ఒక దళిత నాయకుడు, సభాపతి పడిన ఆవేదనను మనం ఖచ్చితంగా అర్థం చేసుకోవాలి.

### కేసీఆర్ తీవ్ర అసంతృప్తి...

ఈ వివాదం ముదిరిపాకాన పడటంతో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. పార్టీకి తీవ్ర నష్టం జరిగేలా ఎందుకు మాట్లాడారంటూ తాతా మధు తీరుపై కేసీఆర్ సీరియస్ అయినట్టు విశ్వసనీయ సమాచారం. పరిస్థితి పూర్తిగా చేయి దాటుతోందని, ఇది పార్టీకి పెద్ద మచ్చగా మారుతుందని గ్రహించిన తర్వాతే తాతా మధు తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించారు. అయితే ఆయన అప్పటికప్పుడు మాట వెనక్కి తీసుకున్నప్పటికీ జరగాల్సిన డామేజ్ జరిగిపోయింది.

### తాతా మధు అరెస్ట్ ఎపిసోడ్...

తాతా మధు అరెస్ట్ వ్యవహారం కూడా ఈ ఎపిసోడ్‌ను మరింత వేడెక్కించి రాజకీయంగా తీవ్ర రూపం దాల్చేలా చేసింది. ఒక చిన్న మాట ఎంత పెద్ద రాజకీయ ప్రళయానికి దారి తీస్తుందో ఈ ఉదంతం మరోసారి నిరూపించింది. బీఆర్ఎస్ పార్టీ డిఫెన్స్‌లో పడటానికి కేవలం వ్యూహాత్మక వైఫల్యమే కాదు, నేతల బాధ్యతారాహిత్యమైన మాట్లాడే శైలే కారణమనే అభిప్రాయం బలపడుతోంది. దళిత నాయకులకు ఉన్నత పదవులు దక్కినా వారి గౌరవానికి రక్షణ ఉండదా అనే కోణంలో కూడా ఇప్పుడు పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

# హిందువుల రచ్చ... ఈఫిల్ మూసివేత

## ఫ్రాన్స్ దేశంలో బాప్స్ సంస్థ నిర్వాకం

- ఈఫిల్ మహిళా ఉద్యోగులకు అవమానం
- తమ కంటికి కనిపించకుండా స్త్రీల తరిమివేత
- వారి మత దురహంకారానికి నిరసనగా సమ్మె
- భారత్ పరువును బజారుకీడ్చిన బాప్స్ సంస్థ
- మహిళల అంటరానితనంపై ఫ్రాన్స్ ఆగ్రహం
- ఉతికి పారేసిన అంతర్జాతీయ మీడియా

**విదేశాలకు వెళ్లి మన దేశం పేరును నిలబెడతామనే మత గురువులు, అక్కడి మహిళా ఉద్యోగులను అంటరానివాళ్లలా చూస్తే ఏమనాలి? ఈ అహంకారపూరిత, సంకుచిత ధోరణిని నిరసిస్తూ ఈఫిల్ టవర్‌నే ఒక రోజు పాటు బంద్ చేశారంటే వీరి అహంభావం ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు! అసలు ఈ వికృత రూపం వెనుక ఉన్న అసలు బండారం ఏంటో చూద్దాం. - సహనం వందే, పారిస్**

పారిస్ నగరానికి గుండెకాయ లాంటి ఈఫిల్ టవర్ ఒక్క రోజు పాటు మూతపడడం వెనుక ఎంతటి మత దురహంకారం ఉందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. భారతీయ హిందూ బాప్స్ సంస్థ ప్రతినిధులు, ముఖ్యంగా వారి 93 ఏళ్ల వయసున్న గురువు టవర్‌ను సందర్శించే సమయంలో మహిళా ఉద్యోగులు ఎవరూ కంటికి కనిపించకూడదనే తుగ్లక్ నిబంధనలు పెట్టారు. ఒక నాగరిక దేశంలో, అందునా మహిళా సమానత్వానికి పెద్దపీట వేసే ఫ్రాన్స్‌గడ్డపై ఇలాంటి మూర్ఖపు పద్ధతులను ప్రదర్శించడం పట్ల అక్కడి అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

### బాప్స్ ఆలయాన్ని ప్రారంభించిన మోడీ...

ఈ దారుణమైన పరిణామాలు జరగడానికి సరిగ్గా ఒక్క రోజు ముందు ప్రధాని నరేంద్ర మోడీ పారిస్ నగరంలో బాప్స్ సంస్థ నిర్మించిన నూతన హిందూ ఆలయాన్ని ఆర్భాటంగా ప్రారంభించారు. భారత్-ఫ్రాన్స్ సాంస్కృతిక బంధం అంటూ వర్చువల్ వేదికగా పేర్కొన్నారు. ఆ ఆలయ ప్రారంభోత్సవానికి వెళ్లిన ఆ సంస్థ పెద్దలు నేరుగా ఈఫిల్ టవర్‌కు వెళ్లిన సమయంలో తమ కుసంస్కారాన్ని బయటపెట్టుకున్నారు. మగవాళ్ళు మాత్రమే ఉండాలి, మహిళా సిబ్బంది మా కళ్ల ముందు తిరగకూడదు అనేలా వీరు వ్యవహరించిన తీరు యావత్ భారతావనికి తలవంపులు తెచ్చేలా ఉంది.

### అహంకారపూరిత డిమాండ్లు...

ఈఫిల్ టవర్ నిర్వాహకులు చెప్పిందేంటంటే... దాదాపు వంద మందికిపైగా ఉన్న ఈ బృందం కోసం టవర్ సిబ్బందిని కట్టడి చేసేలా అహంకారపూరిత డిమాండ్లు చేశారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగులను అక్కడి నుండి బలవంతంగా వేరే ప్రాంతాలకు తరలించి,వారి స్థానంలో మగ ఉద్యోగులను నియమించాలని ఒత్తిడి తెచ్చారు. అంతే కాకుండా ఆ బృందం నడిచే మార్గాల్లో మహిళా సిబ్బంది అస్సలు కనిపించకూడదంటూ కఠినమైన హెచ్చరికలు జారీ చేసినట్లు తేలింది. స్త్రీలను అణచివేయాలనే పురుషాధిక్య భావజాలం విదేశాల్లో కూడా ప్రదర్శిస్తున్న ఈ సంస్థ తీరును అక్కడి టవర్ ఉద్యోగుల యూనియన్ తీవ్రంగా తప్పుబట్టింది.

### ఒక రోజు సమ్మె... ఈఫిల్ మూసివేత

తమ మహిళా సహోద్యోగులకు జరిగిన ఈ ఘోర అవమానాన్ని సహించలేక టవర్ ఉద్యోగులు ఏకంగా ఒక రోజు సమ్మెకు దిగడం అంతర్జాతీయంగా తీవ్రదుమారం చెలరేగింది. ఫ్రాన్స్ మంత్రి ఒరోరె బెర్గే ఈ ఘటనపై నిప్పులు చెరుగుతూ, ఫ్రాన్స్‌లో మహిళలను ఎట్టి పరిస్థితుల్లోనూ వివక్షకు గురిచేయలేమని...ఏ మతం కూడా తమ చట్టాల కంటే గొప్పది కాదని కుండబద్దలు కొట్టారు. ఫ్రాన్స్ రాజకీయ నాయకులు, మీడియా బాప్స్ సంస్థకు తమదేశంలో అసలు ఎలా అనుమతులు దొరికాయని, ఇటువంటి సంస్థల వెనుక ఉన్న రాజకీయం ఏంటని ప్రశ్నిస్తున్నారు.

### గతంలో అమెరికాలోనూ...

గతంలో అమెరికాలోనూ బాప్స్ సంస్థపై లేబర్ కోడ్ ఉల్లంఘనల కేసులు నమోదై ఎఫ్‌బీఐ విచారణ ఎదుర్కొన్న చీకటి కోణాన్ని ఇప్పుడు అందరూ గుర్తు చేస్తున్నారు. మత చాదస్తాన్ని నెత్తికెత్తుకుని విదేశాలకు వెళ్లే ఇటువంటి సంస్థలు మన దేశ పరువును ఏ విధంగా బజారుకీడుస్తున్నాయో ఈ ఘటనే ప్రత్యక్ష నిదర్శనం. భారత విదేశాంగ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ, ఈఫిల్ టవర్‌కు సంబంధించిన వివాదం కేవలం ఆ సంస్థకు, ఈఫిల్ టవర్ అధికారులకు మధ్య జరిగిన వ్యక్తిగత విషయమని చెప్పారు.